క్లుప్తంగా

పైపులైన్ లీకేజీలకు మరమ్మతు



సాక్షి ఎఫెక్ట్..

కోడేరు: మండల కేంద్రంలోని ఒకటో అంగన్‌వాడీ కేంద్రం ఎదుట మిషన్ భగీరథ పైపులైన్ లీకేజీ అవుతోంది. 'లీకేజీ అరికట్టాలి' శీర్షికతో బుధవారం సాక్షి దినపత్రికలో ప్రచురితం అయ్యింది. ఈ మేరకు గ్రామ పంచాయతీ కార్యదర్శి రవితేజ, కారోబార్ సాయిబాబు స్పందించి సిబ్బందితో లీకేజీలకు మరమ్మతు చేపట్టారు.

గుర్తింపు కార్డుల పంపిణీ



బిజినేపల్లి: మండలంలోని పాలెం గ్రామ పంచాయతీలో పని చేసే కార్మికులకు, ఉద్యోగ సిబ్బందికి బుధవారం గుర్తింపు కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి చిన్న బీరయ్య మాట్లాడుతూ సిబ్బంది నిబద్ధతతో పని చేయాలని, జిల్లాలోనే ఉత్తమ గ్రామ పంచాయతీగా పేరు తీసుకురావాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ సువర్ణ, సిబ్బంది అమరేందర్, వెంకటేశ్వర్లు, కొండయ్య, మశన్న, వెంకటయ్య, రామేశ్వరమ్మ, ఆంజనమ్మ, బంగారమ్మ పాల్గొన్నారు.

విద్యార్థుల యూనిఫాం కొలతలు సిద్ధం

తాడూరు: మండల కేంద్రంతోపాటు ఆయా గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలో యూనిఫాంకు సంబంధించి కొలతలను సిద్ధం చేస్తున్నట్లు ఎంఈఓ భాస్కర్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఎమ్మార్సీలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి గ్రామంలో మహిళా సంఘాల ఆధ్వర్యంలోని విద్యార్థులకు ప్రభుత్వం ఇచ్చే యూనిఫాంను తయారు చేయడానికి మహిళా సంఘాల సభ్యులు కొలతలు సిద్ధం చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఐకేపీ ఆధ్వర్యంలో ప్రతి పాఠశాలకు మహిళా సంఘాల సభ్యులు వెళ్లి కొలతలు తీసుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పొట్టు గోదాంలో అగ్ని ప్రమాదం

బిజినేపల్లి: తిమ్మాజిపేట మండలంలోని గుమ్మకొండ గ్రామ సమీపంలోని పల్లి పొట్టు గోదాంలో అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. బుధవారం ఉదయం ప్రమాదవశాత్తు పొట్టు నుంచి పొగలు రావడాన్ని సిబ్బంది గమనించారు. కొద్ది సమయం తర్వాత పొగలు అధికమై మంటలు చెలరేగాయి. వెంటనే అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. సంఘటన స్థలానికి అగ్నిమాపక సిబ్బంది చేరుకుని మంటలను అదుపు చేశారు. లక్షల్లో నష్టం వాటిల్లినట్లు నిర్వాహకులు తెలిపారు.

హైదరాబాద్‌కు డీలక్స్ బస్సులు

కొల్లాపూర్: పట్టణం నుంచి హైదరాబాద్‌కు తెల్లవారుజామున 3 గంటలకు, 4:30 గంటలకు రెండు డీలక్స్ బస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు ఆర్టీసీ డీఎం ఉమాశంకర్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. అదేవిధంగా కొల్లాపూర్ నుంచి పెబ్బేర్, కొత్తకోట, జడ్చర్ల మీదుగా హైదరాబాద్‌కు మధ్యాహ్నం 1:30 గంటలకు బస్సు ఉంటుందని పేర్కొన్నారు.

ప్రమాదవశాత్తు బైక్ దగ్ధం



మన్ననూర్: అచ్చంపేట-మన్ననూర్ ప్రధాన రహదారి మలుపు సమీపంలో బైక్ (గ్లామర్) ప్రమాదవశాత్తు దగ్ధమైన ఘటన బుధవారం చోటు చేసుకున్నది. స్థానికుల వివరాల ప్రకారం అచ్చంపేటకు చెందిన యువకుడు సతీష్ అచ్చంపేట నుంచి మద్దిమడుగు పుణ్యక్షేత్రానికి బైక్‌పై వెళ్తున్నాడు. స్థానిక మూల మలుపు సమీపంలో బైక్ నుంచి పెట్రోల్ లీక్ కావడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. యువకుడు అప్రమత్తమై బైక్ దిగి పక్కకు వెళ్లాడు. క్షణాల్లోనే బైక్ పూర్తిగా దగ్ధమైందని బాధితుడు వాపోయాడు.

సీసీ కెమెరాలకు ఏర్పాటుకు విరాళం

చారకొండ: మండలంలోని మర్రిపల్లిలో సీసీ కెమెరాలను ఏర్పాటుకు కేసీవీఆర్ కంపెనీ నుంచి నూనె విష్ణు, రాజు, కొండల్, బాలకృష్ణ, వెంకటయ్య, రాజు నాయక్ రూ.60 వేలు బుధవారం ఎస్‌ఐ రాజశేఖర్‌కు అందించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మట్లాడుతూ మండలంలోని గ్రామాల్లో సీసీల ఏర్పాటుకు దాతలు ముందుకు రావాలని కోరారు.

భక్తిభావంతో మెలగాలి



ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిని సన్మానిస్తున్న భక్తులు, నాయకులు



శాంతిగూడెంలో విగ్రహాలకు ధాన్యదివాసం, ప్రత్యేక పూజల్లో పాల్గొన్న భక్తులు

కల్వకుర్తి: సమాజంలోని ప్రతి ఒక్కరు భక్తిభావంతో మెలగాలని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. బుధవారం కల్వకుర్తి మండలం జిల్లెలలో మల్లయ్యస్వామి కల్యాణ వేడుకల్లో ఎమ్మెల్యే పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు ఆనంద్, రాములు, శ్రీకాంత్‌రెడ్డి, ఆలయ చైర్మన్ రవిగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో స్వామివారి కల్యాణం

కల్వకుర్తిరూరల్: మండలంలోని జిల్లెలలో బుధవారం భ్రమరాంబిక మల్లికార్జునస్వామి కల్యాణ మహోత్సవ వేడుకలు వైభవంగా నిర్వహించారు. నాగర్‌కర్నూల్ బీజేపీ ఎంపీ అభ్యర్థి భరత్‌ప్రసాద్ కల్యాణవేడుకల్లో పాల్గొని పూజలు చేశారు. ఈ సందర్భంగా మహిళలు బోనాలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకొని స్వామివారికి సమర్పించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఆలయాన్ని పూలు, విద్యుత్ దీపాలతో అలంకరించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జంగయ్య, మాజీ ఉపసర్పంచ్ పాండుగౌడ్, రమేష్, చిక్కొండ కుటుంబసభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతో ప్రశాంతత

తెలకపల్లి: ఆధ్యాత్మికతతో ప్రశాంతత కలుగుతుందని దేవాలయ కమిటీ చైర్మన్ దర్శిరాజయ్య అన్నారు. బుధవారం మండలంలోని పెద్దపల్లి బుగ్గ వేంకటేశ్వరస్వామి దేవాలయ పునర్నిర్మాణం కోసం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా పూర్ణాహుతి, హోమంతోపాటు తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం చైర్మన్ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ భక్తిభావంతో మెలగాలన్నారు. చైర్మన్ రాజయ్య, వెంకటయ్యగౌడ్, లక్ష్మణస్వామి, బాలస్వామిగౌడ్, బంగారయ్య, సుధాకర్, రజిమారెడ్డి, బ్రహ్మచారి, మురళి, కేశవులుగౌడ్, సత్యపాల్‌రావు, గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

చారకొండ: మండలంలోని శాంతిగూడెంలో అభయ ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం బుధవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. బుధవారం దేవాలయంలో ప్రత్యేక పూజలు అనంతరం సాముహిక హోమాలు చేశారు. అనంతరం నూతన దేవాలయంలో నవగ్రహాలను ధాన్యాధివాసం దేవతా హోమాలు నిర్వహించారు. అభయ ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ, నవగ్రహాలను, ధ్వజస్తంభం ప్రతిష్ఠాపన వైభవంగా కొనసాగింది. అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు, చారకొండ మండల సింగిల్‌విండో చైర్మన్ గుర్వయ్య గౌడ్ హాజరు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సిర్సనగండ్ల దేవాలయ చైర్మన్ రామశర్మ, అర్చకులు మురళీధర్ శర్మ, లక్ష్మణ్ శర్మ, అనిశెట్టి శ్రీను, తన్నీరు రామకృష్ణ, నాగేంద్ర, పిచ్చయ్య, శ్యామలయ్య, వెంకటేశ్వర్లు, అశోక్, జగదీష్, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.



జిల్లెలలో బోనాలతో వస్తున్న మహిళలు



పెద్దపల్లి బుగ్గ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో

ఆర్థికసాయం అందజేత



వెల్దండ: మండలంలోని చెదురుపల్లి పాల వెంకటయ్య అనారోగ్యంతో మృతి చెందాడు. బుధవారం బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ యెన్నం శేఖర్‌రెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించి మృతుడి భార్య సావిత్రమ్మకు రూ.5వే ఆర్థికసాయాన్ని అందజేశారు. ఆయన వెంట ఓబీసీ సెల్ మండల అధ్యక్షుడు విష్ణుగౌడ్, మీడియా కన్వీనర్ అంజన్‌కుమార్, ఉపాధ్యక్షుడు దాసు, కొమ్ము వెంకటయ్య, అంతిరెడ్డి, లక్ష్మణ్, మహేష్‌గౌడ్, తదితరులు ఉన్నారు.

కల్వకుర్తిరూరల్: మండలంలోని మార్చాల గ్రామానికి చెందిన రమేష్ అనారోగ్యంతో మృతి చెందాడు. బుధవారం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు తలసాని కృష్ణారెడ్డి బాధిత కుటుంబానికి రూ.4 వేల ఆర్థికసాయాన్ని అందజేశారు. లింగం, నరేష్‌గౌడ్, కిశోర్, గౌస్ తదితరులు పాల్గొన్నారు.

వరి కొనుగోలు కేంద్రం ప్రారంభం



తోటపల్లిలో కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న రైతులు



వెల్దండ మండలం బొల్లంపల్లిలో

చారకొండ: మండల కేంద్రంలోని సింగిల్ విండో కార్యాలయం వద్ద సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని సహకార సంఘం అసిస్టెంట్ రిజిస్టర్ శ్రీనివాసులు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన యాసంగి పంట వరి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలన్నారు. మద్దతు ధర ఏగ్రేడ్ రకం రూ.2203, సాధారణ రకం రూ. 2183లు ప్రభుత్వం ఇస్తుందని తెలిపారు. రైతుల ఖాతాలో నగదు బదిలీ అవుతుందన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ సీఈఓ వెంకటయ్య, సెంటర్ ఇన్‌చార్జ్ బీమయ్య, ఏఈఓ వంశీ రైతులు తదితరులు ఉన్నారు.

వెల్దండ: మండలంలోని బొల్లంపల్లిలో బుధవారం మహిళ గ్రామ ఐక్య సహకారం సంఘం ఆధ్వర్యంలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎంపీడీఓ సత్యపాల్‌రెడ్డితో అధికారుల బృందం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ధాన్యం కొనుగోలులో ఎలాంటి అక్రమాలకు పాల్పడిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఏఓ మంజు, ఏపీఎం రాములు, సిబ్బంది డాక్య, రాములయ్య, గిరి, రవి, శ్వేత, మహిళ సంఘాల సభ్యులు తదితరులు ఉన్నారు.

తోటపల్లిలో..

కల్వకుర్తిరూరల్: మండలంలోని తోటపల్లిలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని రైతులు ప్రారంభించారు. కార్యక్రమంలో సెంటర్ ఇన్‌చార్జ్ నాగరాజు, రైతులు శేఖరయ్య, రుక్మాంగారెడ్డి, సత్యనారాయణ, సాయిలు, పర్వతాలు తదితరులు పాల్గొన్నారు.

నేడు లింగాలలో..

లింగాల: మండల కేంద్రంతో పాటు అంబట్‌పల్లి, అవుసలికుంట, జీల్గుపల్లిలో పీఏసీఎస్ సీఈఓ పాండు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు ధాన్యాన్ని కేంద్రాలకు తీసుకొచ్చి మద్దతు ధర పొందాలని ఆయన కోరారు.

నిరంజన్‌గౌడ్ రాజీనామా

ఊర్కొండ: నాగర్ కర్నూల్ జిల్లా బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్ష పదవికి రాజీనామా చేసినట్లు మండలంలోని నర్సంపల్లి మాజీ సర్పంచ్ వాగుల్దస్ నిరంజన్‌గౌడ్ తెలిపారు. బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ గతంలో తనపై దాడి చేసిన బీఆర్ఎస్ నాయకులను బీజేపీలో చేర్చుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వారు నిత్యం అవమానాలకు గురిచేస్తున్నారని దీంతో రాజీనామా చేస్తున్నానని పేర్కొన్నారు. ఈ మేరకు రాజీనామా పత్రాన్ని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్ రావుకు పంపించానని వివరించారు.

కాంగ్రెస్‌తోనే ముస్లింల సంక్షేమం సాధ్యం



వంగూరులో పాల్గొన్న ఎమ్మెల్యే వంశీకృష్ణ



మన్ననూరులో హాజరైన డీఎఫ్‌ఓ

వంగూరు: కాంగ్రెస్‌తోనే ముస్లింల సంక్షేమం సాధ్యమని ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. మండల కేంద్రంలో బుధవారం రాత్రి కాంగ్రెస్ నాయకులు షరీఫ్‌ఖాన్ ఇచ్చిన ఇఫ్తార్‌లో నాగర్‌కర్నూల్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ మల్లురవితో కలిసి ఎమ్మెల్యే హాజరయ్యారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు కేవీఎన్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు రమేష్‌గౌడ్, కాంగ్రెస్ నాయకులు యాదగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

మన్ననూర్: స్థానిక ఫారెస్టు డివిజన్ అధికారి (ఎఫ్‌డీఓ) కార్యాలయం ఆవరణలో బుధవారం ముస్లింలకు అటవీశాఖ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డీఎఫ్‌ఓ రోహిత్ రెడ్డి ముస్లింలతో కలిసి సహపంక్తి భోజనాలు చేశారు. అనంతరం డీఎఫ్‌ఓ మాట్లాడుతూ ఇఫ్తార్ మతసామరస్యాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. అనంతరం మసీద్ పెద్దలు డీఎఫ్‌ఓను సన్మానించారు. కార్యక్రమంలో ఎఫ్ఆర్‌ఓలు ఈశ్వర్, ఆదిత్య, పర్వేజ్, రవి, ముజీబ్, ఎంపీటీసీ రహీం, నాయకులు నసీర్, జాఫర్ ఉసేన్, నయిముల్లా, మేరాజ్, అజ్జు, బాబలి, రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.

ఛత్రపతి శివాజీకి నివాళి



ఊర్కొండ: మండలంలోని ఊర్కొండపేటలో బుధవారం ఛత్రపతి శివాజీ యూత్ ఆధ్వర్యంలో వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా శివాజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అనిత, జిల్లా పరిషత్ పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు యాదయ్య గౌడ్, శివాజీ యూత్ సభ్యులు రేపని శ్రీనివాస్, రామాంజనేయులు, బీజేపీ మండల ఉపాధ్యక్షుడు ఆంజనేయులు, కటామోని ఆంజనేయులు, ప్రవీణ్ రెడ్డి, బండి శ్రీను, రాము, శివ, హరీష్, గణేశ్ సభ్యులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య రాకుండా చర్యలు

వెల్దండ: వేసవికాలంలో తాగునీటి సమస్య రాకుండా చర్యలు తీసుకుంటున్నామని ఎంపీడీఓ సత్యపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం గ్రామాల ప్రత్యేకాధికారులు, కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా అధికారుల ఆదేశాల మేరకు గ్రామ ప్రత్యేక అధికారులు గ్రామాల్లో పర్యటించి సమస్యలు పరిష్కరించాలన్నారు. తాగునీటి ఎద్దడి రాకుండా చూడాలని కోరారు. పైపులైన్ లీకేజీలను వెంటనే మరమ్మతు చేపట్టాలన్నారు. మిషన్ భగీరథ నీరు సక్రమంగా సరఫరాకు అంతరాయం ఏర్పడితే ట్యాంకర్ల ద్వారా నీటిని అందించాలని సూచించారు. జాతీయ ఉపాధి పనుల్లో కూలీల సంఖ్య పెంచాలన్నారు. జాబ్‌కార్డులు లేనివారిని గుర్తించి కొత్తకార్డులను అందించాలన్నారు. కార్యక్రమంలో ప్రత్యేక అధికారులు డిప్యూటీ తహసీల్దార్ శ్రీను, పశువైద్య అధికారి శ్యామ్‌సుందర్, ఏఓ మంజుల, ఎంపీఓ సునీత, ఏఈ మహేందర్, తదితరులు ఉన్నారు.

క్రీడా సామగ్రి పంపిణీ



తాడూరు: మండలంలోని అల్లాపూర్ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు బుధవారం క్లాస్‌మేట్ క్లబ్ ఆధ్వర్యంలో క్రీడాసామగ్రిని అందజేశారు. 2011 ఏప్రిల్ 2న వన్డే వరల్డ్‌కప్‌లో ఇండియా గెలుపును పురస్కరించుకొని క్రీడా సామగ్రి అందజేసినట్లు క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు వాస రాఘవేందర్ తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం కట్ట శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

మన్ననూర్: పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున శ్రీశైలం-హైదరాబాద్ ప్రధాన రహదారి మన్ననూర్‌లో నిర్వహణలో ఉన్న రెండు చెక్‌పోస్టుల వద్ద పోలీసు అధికారులు సిబ్బందితో కలిసి వాహనాలను తనిఖీలు చేస్తున్నారు. బుధవారం మృగవాణి రెస్టారెంట్ సమీపంలోని అటవీ చెక్‌పోస్టు వద్ద స్టాటిక్ సర్వేలెన్స్ టీమ్ (ఎస్ఎస్‌టీ), అమ్రాబాద్ రెండో ఎస్‌ఐ ఖాద్రీ, పోలీసులు బాల్‌రాజ్, నాను నాయక్, వెంకట్ కృష్ణ, 10 మంది పోలీసులు 24 గంటల పాటు విధుల్లో నిర్వర్తిస్తున్నారు. ప్రతి వాహనాన్ని వారు క్షుణ్ణంగా తనిఖీలు చేస్తున్నారు.



పంచాయతీగా గుర్తించాలి



కొల్లాపూర్: మండలంలోని ముక్కిడిగుండం పంచాయతీకి అనుబంధంగా ఉన్న గేమ్యానాయక్ తండాను గ్రామ పంచాయతీగా గుర్తించాలని సీపీఎం మండల కార్యదర్శి శివవర్మ డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో ఆర్డీఓ నాగరాజుకు వినతిపత్రం అందజేశారు. పంచాయతీ గుర్తింపునకు గేమ్యానాయక్ తండాకు అన్ని రకాల అర్హతలు ఉన్నాయన్నారు. నాయకులు సలీం, బాలునాయక్, రాజు, మధు, నరేష్, శివకుమార్, పవన్ తదితరులున్నారు.

నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి

తాడూరు: వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రజలకు తాగునీటి సమస్య లేకుండా అధికారులు చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే డా.కూచుకుళ్ల రాజేష్ రెడ్డి ఆదేశించారు. బుధవారం ఎంపీపీ శ్రీదేవి అధ్యక్షతన మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఎండలు తీవ్రమైనందున గ్రామాల్లో ప్రజలకు తాగునీటి సమస్య తలెత్తకుండా, గ్రామస్థాయి అధికారులతో మండల స్థాయి అధికారులు సమీక్ష నిర్వహించి తక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. నీటి సమస్యపై తనకు ఫిర్యాదులు అందితే సహించేది లేదని హెచ్చరించారు. గ్రామాల్లో అవసరమైన చోట బోర్లు వేసి, ట్యాంకుల ద్వార నీటిని సరఫరా చేయాలని సూచించారు. అధికారులు గ్రామస్థాయి ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులు, గ్రామస్థాయిలో సమస్యలు గుర్తించి తక్షణమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా విద్యుత్ సరఫరాలో ఎలాంటి ఆటంకాలు లేకుండా చూడాలని, గ్రామాల్లో అవసరమైన చోట విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేసి, విద్యుత్ పరమైన సమస్యలు పరిష్కరించాలన్నారు. ఆస్పత్రికి వచ్చే ప్రజలకు అవసరమైన మందులను అందుబాటులో ఉంచేలా తగిన చర్యలు చేపట్టాలని సూచనలు, సలహాలు ఇచ్చారు. సమావేశంలో వైస్ ఎంపీపీ శివలీల, సింగిల్‌విండో చైర్మన్ వెంకట్‌రెడ్డి, ఎంపీడీఓ జ్యోతిపరోసియా, ఆయా శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో మాదిగలు ఏకం కావాలి



ఖర్గే చిత్రపటాన్ని దహనం చేస్తున్న నాయకులు

నాగర్‌కర్నూల్‌రూరల్: పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే దిష్టిబొమ్మను బుధవారం ఎమ్మార్పీఎస్ నాయకులు దహనం చేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా కన్వీనర్ ఊట విజయ్ మాట్లాడుతూ పార్లమెంట్ స్థానాల్లో మాదిగలకు ఒక్కసీటు కూడా ఇవ్వకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మాదిగలకు అన్యాయం చేయడం ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు. సీట్లు ఇవ్వకపోవడం వెనక ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ఓడించేందుకు మాదిగలమంతా ఏకం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు బోనాసి రాములు, నల్లగంటి నాగన్న, భీంరాజు, బోనాసి రాజు, ఆదిరాల వెంకటయ్య, నరేందర్, భాస్కర్, రాజు, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బీరప్ప పండుగ


తెలకపల్లి: మండలంలోని లక్నారంలో బుధవారం గోపాల వంశస్తులైన కుర్వలు బీరప్ప పండుగలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గోపాల వంశస్తులు, మహిళలు బోనాలను అలంకరించుకొని డప్పుచప్పుళ్ల మధ్య ఊరేగింపుగా వెళ్లారు. బీరప్పదేవాలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి నైవేద్యం సమర్పించారు. కార్యక్రమంలో భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న విద్యార్థుల బోధన



తెలకపల్లి: మండలంలోని వట్టిపల్లి, బోరబండతండా ప్రాథమిక పాఠశాలలో బుధవారం స్వయంపరిపాలన దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా, అధికారులుగా వ్యవహరించారు. తోటి విద్యార్థులకు విద్యాబోధన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో హెచ్‌ఎం ప్రభాకర్ మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి ఉత్తమమైనదన్నారు. విద్యార్థులు బాగా చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జి కవిత, జైపాల్, అనూష, శ్రీనివాసులు, సునీల్‌కుమార్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మెరిట్ టెస్టు



కొల్లాపూర్: పట్టణంలోని వాసవీ కన్యకా పరమేశ్వరీ కల్యాణ మండపంలో బుధవారం కొల్లాపూర్ ఓల్డ్ స్టూడెంట్ ఆర్గనైజేషన్(కోసా) ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న పాలీసెట్ ఉచిత శిక్షణ కోసం విద్యార్థులకు మెరిట్ టెస్టు నిర్వహించారు. 500 మంది హాజరైనట్లు కోసా సంస్థ ప్రధాన కార్యదర్శి శశికాంత్ వాల్మీకీ తెలిపారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ఉచిత హాస్టల్, భోజన వసతి, శిక్షణ ఇస్తామని పేర్కొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

పెద్దకొత్తపల్లి: పంచాయతీ పరిధిలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు ఐదు నెలల నుంచి పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలని మండల కమిటీ అధ్యక్షుడు బాలస్వామి కోరారు. బుధవారం మండల కేంద్రంలో ఎంపీడీఓ లక్ష్మణ్‌నాయక్‌కు వినతిపత్రాన్ని అందించారు. మల్టీపర్పస్ విధానం రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో మద్దిలేటి, రాముడు, రాఘవేందర్, రవి, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

తప్పిన పెను ప్రమాదం

కోడేరు: బస్సు టైర్ పంక్చర్ కావడంతో డ్రైవర్ గమనించి చాకచక్యంగా వ్యవహరించి పెను ప్రమాదం నుంచి తప్పించాడు. స్థానికుల వివరాల ప్రకారం మండల నుంచి వనపర్తికి 34 మంది ప్రయాణికులతో వెళ్తున్న ఆర్టీసీ బస్సు నాగులపల్లి మూలమలుపు వద్ద బస్సు ముందు టైర్ పంక్చర్ అయ్యింది. డ్రైవర్ నరసింహ చాకచక్యంతో వెంటనే బస్సును నిలిపివేశాడు. ప్రమాదం నుంచి బయటపడటంతో ప్రయాణికులు ఊపిరిపీల్చుకున్నారు. గంట తరువాత టైర్ పంక్చర్ చేసుకొని వనపర్తికి బయలుదేరి వెళ్లారు.

సైనిక్ పాఠశాలకు ఎంపిక

పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలోని బీసీ గురుకుల పాఠశాల నుంచి 10వ తరగతి విద్యార్థులు నలుగురు సైనిక్ పాఠశాలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ అక్కులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. కే అరున్, బి వరున్, బి రాజు, బి ఉమేష్‌చంద్ర విద్యార్థులు కరీంనగర్ సైనిక పాఠశాలకు ఎంపికయ్యారని పేర్కొన్నారు.

నిబంధనలు పాటించాలి

పెద్దకొత్తపల్లి: ఎన్నికల నియమావళి ఉల్లంఘించొద్దని ఎవరైన అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ సతీష్ హెచ్చరించారు. బుధవారం చిన్నకొత్తపల్లి గ్రామానికి చెందిన వెంకటయ్య, లక్ష్మయ్య, తిరుపతయ్యలను తహసీల్దార్ ఈసూఫ్ అలీ ఎదుట బైండోవర్ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా గ్రామంలో మద్యం విక్రయిస్తుండగా పట్టుకొని వారిని తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు. అనంతరం సొంతపూచీకత్తుపై విడుదల చేశారు.

ఇంకుడు గుంతలపై అవగాహన

తెలకపల్లి: పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం ఉంటారని ఎన్ఎస్ఎస్ విద్యార్థులు చిన్నముద్దునూర్ గ్రామస్తులకు సూచించారు. బుధవారం మండలంలోని చిన్నముద్దునూర్ గ్రామంలో నాగర్‌కర్నూల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల సైన్స్ విద్యార్థులు ఎన్ఎస్ఎస్ క్యాంపులో భాగంగా గ్రామంలో శ్రమదానం చేశారు. గ్రామంలో ఇంకుడు గుంతలను తవ్వి ప్రజలకు అవగాహన కల్పించారు. అదేవిధంగా వర్మికంపోస్టును తయారు చేసి చూపించారు. కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారి రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శి పరమేష్, అధికారులు, గ్రామస్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

ఉప్పునుంతల: మండల సరిహద్దులోని దుందుబీ వాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను మంగళవారం రాత్రి మొల్గర సమీపంలో పోలీసులు పట్టుకున్నారు. ట్రాక్టర్‌ను అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. బుధవారం ట్రాక్టర్ డ్రైవర్ బల్మూర్ మండలం మైలారం గ్రామానికి చెందిన అంజనేయులు, అదేవిధంగా ట్రాక్టర్ యజమాని అచ్చంపేటకు చెందిన మహ్మద్ షఫీపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ లెనిన్ తెలిపారు.

వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి



కూలీలకు సూచనలు ఇస్తున్న వైద్య సిబ్బంది

బిజినేపల్లి: వేసవికాలంలో కూలీలు వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పాలెం పీహెచ్‌సీ హెల్త్ అసిస్టెంట్ గోవర్ధన్ అన్నారు. బుధవారం పాలెంలో పని చేస్తున్న ఉపాధి కూలీల ప్రాంతాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవికాలంలో కూలీలు ఉదయమే పనికి వెళ్లి 12 గంటలలోపు పనులు ముగించాలని కోరారు. వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. వడదెబ్బ లక్షణాలు, నివారణపై అవగాహన కల్పించారు. కార్యదర్శి చిన్న బీరయ్య, వైద్య సిబ్బంది గజవర్ధనమ్మ, ఫీల్డ్ అసిస్టెంట్ అబేదాబేగం, సిబ్బంది పాల్గొన్నారు.

ముమ్మరంగా చెక్ డ్యాం నిర్మాణం పనులు



పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

లింగాల: మండలంలోని అప్పాయపల్లిలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన చెక్ డ్యాం నిర్మాణం పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. బుధవారం ఎంపీడీఓ ఆంజనేయులు నిర్మాణం పనులను పరిశీలించి సూచనలు, సలహాలు ఇచ్చారు. పనులలో నాణ్యత ప్రమాణాలు పాటించాలన్నారు. అదే విధంగా ఒండ్రు తీసే పనులను, నర్సరీ, వాటర్ ట్యాంక్ దగ్గర తాగునీటిని క్లోరినేషన్ పనులను పరిశీలించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఎస్. వెంకటేశ్వర్లు, ఈసీ శ్రీనివాసులు, టీఏ లింగస్వామి పాల్గొన్నారు.